నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
12 | ఖమ్మం, సోమవారం 28 ఏప్రిల్ 2025 | BHADRADRI KOTHAGUDEM


ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు, చిత్రంలో ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర, కందాళ, చంద్రావతి, పార్టీ నాయకులు

# సభకు తరలిన ప్రజావాహినిని చూసి కాంగ్రెస్‌కు దడ


ఖమ్మం నగరంలోని ఓ ఇంట్లో టీవీ చూస్తూ కేసీఆర్ ప్రసంగానికి ఈలలు వేస్తున్న కుటుంబ సభ్యులు





## కేసీఆర్ స్పీచ్ కోసం..

**ఉత్కంఠగా ఎదురుచూసిన జిల్లా ప్రజలు**
**టీవీల ముందు కూర్చుని వీక్షించిన జనం**
**హోటళ్లు, బార్లలోనూ తిలకించిన యువకులు**
**నలుగురు గుమిగూడిన చోటల్లా 'ఎల్కతుర్తి' చర్చే..**
**సభకు లక్షలాదిగా చేరుకున్నారంటూ కామెంట్స్**

ఖమ్మం, ఏప్రిల్ 27: మహా కుంభమేళాను తలపించేలా లక్షలాది మంది ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఎల్కతుర్తి సభకు తరలివెళ్లడంపై ఖమ్మంలోనూ చర్చనీయాంశమైంది. ఎల్కతుర్తి సభలో ఏం మాట్లాడుతారోనంటూ ఆదివారం మధ్యాహ్నం నుంచే ఖమ్మం జిల్లాలోని వ్యాపారులు, ఉద్యోగులు, మహిళలు, యువకులు ఆసక్తిని ప్రదర్శించారు. సాయంత్రం 5 గంటలకెల్లా టీవీలకు అతక్కుపోయారు. సభలో కేసీఆర్ ప్రసంగం ముగిసే వరకూ టీవీల ముందు నుంచి కదల్లేదు. పనులు, ప్రయాణాల్లో ఉన్న వారు తమ సెల్‌ఫోన్లలో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. అన్ని వర్గాల ప్రజలూ టీవీల ముందు కూర్చొని సభను చూస్తూ కేసీఆర్ ప్రసంగాన్ని ఆసాంతం విన్నారు. కేసీఆర్ స్పీచ్ ప్రసారమైనంత సేపూ మరో చానెల్‌ను పెట్టిన వారు లేరంటే అతిశయోక్తి లేదు. టీస్టాళ్లు, బార్లు, హోటళ్లు సహా బస్టాండ్లలోని టీవీల్లోనూ కేసీఆర్ ఉపన్యాసాన్నే వీక్షించారు. ఎక్కడ నలుగురు గుమికూడినా కేసీఆర్ ప్రసంగం, ఎల్కతుర్తి సభ, లక్షలాదిగా తరలివచ్చిన జనం గురించే చర్చించుకున్నారు. ఆటోలు, బస్సుల్లో ప్రయాణించేవారు కూడా రజతోత్సవ సభ ప్రసంగం గురించే మాట్లాకోవడం గమనార్హం. కాగా, సభ విజయవంతంపై బీఆర్ఎస్ శ్రేణులు సంతోషం వ్యక్తం చేశాయి.

**వరంగల్ సభకు తరలిన ప్రజావాహినిని చూసి కాంగ్రెస్ సర్కారుకు దడపుడుతోందని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. అలవిగానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. కేవలం 16 నెలల్లోనే ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పాలనే హస్తం పార్టీకి ఉరితాడు అవుతుందని తేల్చిచెప్పారు. తెలంగాణ ప్రజల దీవెనలతో 2028లో కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చూస్తామని స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ నిర్వహించే రజతోత్సవ సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి గులాబీ సేనలతోపాటు సబ్బండ వర్గాల ప్రజలు వేలాదిగా తరలివెళ్లారు. కాగా, పాతికేళ్ల పండుగ సందర్భంగా అన్ని గ్రామాల్లోనూ పార్టీ నేతలు బీఆర్ఎస్ దిమ్మెలపై గులాబీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం వందలాది వాహనాల్లో సభకు బయలుదేరి వెళ్లారు.**

**–నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 27**






సభకు బయలుదేరే ముందు శ్రేణులతో కలిసి స్టెప్పులేస్తున్న మాజీ ఎమ్మెల్యే వనమా, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా, సభా వేదికపై తాతా మధు, వద్దిరాజు, పార్థసారథిరెడ్డి

సభకు బయలుదేరేముందు తిరుమలాయపాలెంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఖమ్మం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, ఖమ్మం నగరంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఖమ్మం రూరల్లో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మణుగూరులో పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, ఇల్లెందులో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, కొత్తగూడెంలో మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, దమ్మపేటలో అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, మధిరలో ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, భద్రాచలంలో బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు మానె రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్ తదితరులు బీఆర్ఎస్ దిమ్మెలపై గులాబీ జెండాలను ఎగురవేశారు. అంతకుముందు భారీగా బైక్ ర్యాలీలు నిర్వహించారు. కనుచూపు మేరలో కల్పించేలా బస్సులు, కార్లు, ఇతర వాహనాల్లో గులాబీ శ్రేణులు తరలివెళ్లాయి. మణుగూరులో రేగా కాంతారావు, కొత్తగూడెంలో వనమా వెంకటేశ్వరరావులు గులాబీ శ్రేణులతో కలిసి నృత్యాలు చేసి వారిని ఉత్సాహ పరిచారు. వనమా సతీమణి పద్మావతి బొట్టుపెట్టి మరీ వనమాను వరంగల్‌కు సభకు పంపారు.

- **రేవంత్‌రెడ్డి పాలనే హస్తం పార్టీకి ఉరితాడు అవుతుంది**
- **16 నెలల్లోనే ప్రజల నమ్మకాన్ని కాంగ్రెస్ కోల్పోయింది**
- **అడ్డంకులు కల్పించి గులాబీ సేనలను నిలువరించలేరు**
- **2028లో కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చూస్తాం**
- **కొట్లాడి తెచుకున్న తెలంగాణకు ఉద్యమసారథే శ్రీరామరక్ష**
- **రజతోత్సవ జెండావిష్కరణల్లో బీఆర్ఎస్ ముఖ్య నేతలు**
- **జెండాలు ఊపి వాహనాలను ప్రారంభించిన నాయకులు**
- **పాల్గొన్న వద్దిరాజు, తాతా, అజయ్, సండ్ర, కందాళ, మదన్‌లాల్**
- **భద్రాద్రి జిల్లాలో రేగా, వనమా, హరిప్రియ, మెచ్చా**
- **ఎల్కతుర్తికి బారులు తీరిన గులాబీ శ్రేణుల వాహనాలు**

### కాంగ్రెస్‌కు దడ పుడుతోంది

బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా తెలంగాణ గులాబీమయమవడాన్ని చూసి కాంగ్రెస్ ప్రభుత్వం హడలెత్తిపోతోందని పార్టీ నేతలు విమర్శించారు. ఎల్కతుర్తి సభకు తరలివెళ్తున్న జనసంద్రాన్ని చూసి రేవంత్ సర్కారుకు దడపుడుతోందని ఎద్దేవాచేశారు. కేసీఆర్‌ను కళ్లారా చూసేందుకు, ఉపన్యాసాన్ని చెవులారా వినేందుకు తెలంగాణ ప్రజలందరూ వరంగల్‌కు తరలుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సభకు వెళ్లే వాహనాలను అడ్డుకునేందు కుట్రలు పన్నుతున్న వాళ్లు మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. బీఆర్ఎస్ సభకు వాహనాలను సమకూర్చిన వారిని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి భయభ్రాంతులకు గురి చేయడం దారుణమని అన్నారు. మంత్రులు హైదరాబాద్‌లో కూర్చొని ఖమ్మం నుంచి బహిరంగ సభకు బయలుదేరిన ప్రజలను అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. కానీ వారి కుట్రలన్నీ విఫలమయ్యాయని, జిల్లా ప్రజలందరూ వరంగల్ సభకు చేరుకున్నారని స్పష్టం చేశారు. సబ్బండ వర్గాలకు గులాబీ జెండాను అండగా నిలుస్తుందని అభయమిచ్చారు. యావత్ తెలంగాణ సమాజం కేసీఆర్ పాలన కోసం ఎదురుచూస్తోందని అన్నారు. రాబోయే రోజులు బీఆర్ఎస్‌వేనని స్పష్టం చేశారు. ఎల్కతుర్తి సభ అద్భుతంగా విజయవంతమైందని అన్నారు. గులాబీ పార్టీ విజృంభణకు ఇది ఆరంభం మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ సభను చూసి కాంగ్రెస్ ప్రభుత్వానికి భయం కలుగుతోందని అన్నారు. భవిష్యత్తులో ప్రజలే బుద్ధిచెప్పడం ఖాయమని, గద్దె దింపడం ఖాయమని స్పష్టం చేశారు.


ఖమ్మంలో పార్టీ జెండా ఎగురవేస్తున్న తాతా మధు


దమ్మపేటలో గులాబీ జెండా ఎగురవేస్తున్న మెచ్చా


బస్సులో 'జై తెలంగాణ' నినాదాలు


మధిరలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తున్న లింగాల


కొత్తగూడెం నుంచి వెళ్తున్న శ్రేణులు



వైరాలో జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్


తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న హరిప్రియ


ఖమ్మంలో బస్సును ప్రారంభించి జై తెలంగాణ నినాదాలు చేస్తున్న మాజీ మంత్రి అజయ్‌కుమార్


బైక్ ర్యాలీలో అజయ్


వాహనాలను ప్రారంభిస్తున్న రేగా


వరంగల్ బయలుదేరిన భద్రాచలం నియోజకవర్గ నేతలు


తిరుమలాయపాలెం నుంచి కదులుతున్న బస్సులు


మణుగూరు నుంచి బయలుదేరిన కార్లు

## అడ్డంకులను అధిగమించి.. నిర్బంధాలను ఛేదించి..
# ఓ(పో)రుగల్లుకు గులాబీదండు

- **వేలాది వాహనాలతో ఎల్కతుర్తికి పోటెత్తిన శ్రేణులు, ప్రజలు**
- **ఖమ్మంలో వాహనాల నిలిపివేతపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం**
- **దగ్గరుండి వాహనాలు పంపిన పువ్వాడ అజయ్, తాతా మధు**

ఖమ్మం, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అడ్డంకులు సృష్టించినా ఉమ్మడి జిల్లా నుంచి బీఆర్ఎస్ రజతోత్సవ సభ జరిగే ఎల్కతుర్తికి ఆదివారం గులాబీ దండు కదిలింది. ఎవరెన్ని ఆటంకాలు కల్పించినా, ఎక్కిన బస్సును దింపివేయడానికి ప్రయత్నించినా గులాబీ సైన్యం తమ పార్టీ నేతల అండదండలంతో ముందుకు సాగింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల నుంచి అంచనాలకు మించి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు ఉదయమే తమ తమ ప్రాంతాల నుంచి బస్సులు, కార్లు, ఇతర వాహనాల ద్వారా ఎల్కతుర్తి సభకు బయలుదేరాయి. సత్తుపల్లి ప్రాంతం నుంచి బయలుదేరిన ప్రైవేటు బస్సులను కల్లూరు వద్ద రవాణాశాఖ అధికారులు అడ్డుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ప్రైవేటు బస్సులకు అనుమతిలేదంటూ రవాణా శాఖ అధికారులు పార్టీ శ్రేణులకు చెప్పడంతో ముందస్తుగా అనుమతులు తీసుకున్నాక ఇప్పుడు ఆపడమేంటంటూ పార్టీ నేతలు కల్లూరు ప్రధాన రహదారిపై బైఠాయించారు. సమాచారం తెలుసుకున్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు.. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడారు. సభకు వెళ్లే వారిని అడ్డుకోవడమేమిటని ప్రశ్నించారు. దీంతో వాహనాలను అధికారులు పంపించారు. ఇక ఖమ్మం జిల్లా నుంచి వెళ్తున్న అనేక వాహనాలను తిరుమలాయపాలెం వద్ద ఆర్‌టీఏ అధికారులు మరోసారి తనిఖీ పేరిట నిలిపివేశారు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య తదితరులు తిరుమలాయపాలెం చేరుకొని ఆర్‌టీఏ అధికారులను ప్రశ్నించారు. కారణం తెలుపకుండా బస్సులు ఎలా ఆపుతారని, సామరస్య ధోరణితో వ్యవహరించాల్సిన అధికారులు తనిఖీల పేరుతో ఇబ్బందిపెట్టడమేంటని నిలదీశారు. అక్కడ నిలిపిన బస్సులను తాతా మధు, సండ్ర, కందాళ స్వయంగా దగ్గరుండి సభకు పంపించారు. తరువాత మళ్లీ అక్కడే బస్సులను ఆపుతున్నారన్న సమాచారం తెలుసుకుని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పార్టీ శ్రేణులతో కలిసి తిరుమలాయపాలెం చేరుకున్నారు. బస్సులను ఆపి పార్టీ కార్యకర్తలను ఇబ్బందిపెడితే తాను ఇక్కడే ఉండి ధర్నా చేస్తానని స్పష్టం చేశారు. అన్ని బస్సులు వెళ్లేంతవరకు కదలబోనని భీష్మించారు. ఆర్‌టీఏ ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడారు. బస్సులు నిలిపివేయాలన్న ఆదేశాలేమీ లేవని, బస్సులు పంపించాలని అక్కడున్న అధికారులకు చెబుతామని వారు సమాధానమిచ్చారు. ఖమ్మం జిల్లా నుంచి బస్సులు వెళ్లేంత వరకు పువ్వాడ అజయ్ తిరుమలాయపాలెం పోలీసు స్టేషన్ సమీపంలో కూర్చుని ఎల్కతుర్తికి బస్సులు సజావుగా వెళ్లేలా పర్యవేక్షించారు. ఆర్టీసీ బస్సులతోపాటు కార్యకర్తలు, పార్టీ నాయకులు ప్రైవేటు బస్సులను ఏర్పాటు చేసుకుని పెద్ద ఎత్తున సభకు తరలివెళ్లారు. ప్రతి గ్రామం నుంచి సభకు వెల్లువలా కార్యకర్తలు తరలివెళ్లారు.



సభకు వెళ్తున్న బస్సులను ఎందుకు ఆపుతున్నారంటూ డీటీవోను ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి అజయ్‌మార్


తిరుమలాయపాలెంలో సభకు వెళ్లే బస్సులను ఆపిన డీటీవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్సీ తాతా మధు

### వేలాదిగా వాహనాల్లో..

అశ్వారావుపేట, భద్రాచలం, పినపాక, కొత్తగూడెం, ఇల్లెందు, వైరా, సత్తుపల్లి, మధిర, పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు వెల్లువలా తరలివెళ్లారు. వేలాదిమంది సొంతంగా వాహనాలు సమకూర్చుకుని మరీ బయలుదేరారు. పార్టీ అధినేత కేసీఆర్ ప్రసంగాన్ని వినేందుకు పయనమై వెళ్లారు. వాహనాల్లో వెళ్లేవారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జులు, నేతలు ప్రతి బస్సుకు ఇద్దరు ఇన్‌చార్జులను నియమించి ఏర్పాట్లు చేశారు. మంచినీరు, మజ్జిగ వంటి ప్యాకెట్లను బస్సుల్లో సిద్ధంగా ఉంచారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, మదన్‌లాల్, హరిప్రియనాయక్, వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, భద్రాచలం నియోజకవర్గ నాయకులు మానె రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్‌ల ఆధ్వర్యంలో కార్యకర్తలు కార్యకర్తలు వేలాది వాహనాల్లో తరలివెళ్లారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు లక్ష మంది వరకు కార్యకర్తలు వెళ్లినట్లు పార్టీ వర్గాల సమాచారం.